క్లుప్తంగా

చౌడాలమ్మ తల్లి సేవలో ప్రభుత్వ విప్


ఆలయంలో పూజలు చేస్తున్న లక్ష్మణ్‌కుమార్

పెగడపల్లి: మండలంలోని నందగిరిలో జరుగుతున్న చౌడాలమ్మ తల్లి బోనాల వేడుకల్లో సోమవారం ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చౌడాలమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాములుగౌడ్, విండో చైర్మన్ భాస్కర్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్, సత్యనారాయణరెడ్డి, అశోక్‌రెడ్డి, సతీశ్, కొమురయ్య, సురేశ్, రవి, గంగాధర్, మల్లేశం, భాస్కర్, తిరుపతి, రాజేందర్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే,జెడ్పీచైర్‌పర్సన్‌ను కలిసిన జిల్లా వైద్యాధికారి


ఎమ్మెల్యేను కలిసిన జిల్లా వైద్యాధికారి

జగిత్యాల/జగిత్యాల రూరల్: జిల్లా వైద్యాధికారిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన సమియొద్దీన్ సోమవారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ దావ వసంతను మర్యాదపూర్వకంగా కలుసుకుని పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయన వెంట డెప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్ ఉన్నారు.

అటవీ భూముల ఆక్రమణను ఆపాలి


ఆత్మనగర్ శివారులో చదును చేసిన భూమి

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం ఆత్మనగర్ శివారులో అటవీ భూముల ఆక్రమణను ఆపాలని మాజీ సర్పంచ్ శ్రీనివాస్ అన్నారు. ఆత్మనగర్ అమృత్ సరోవర్ ప్రాంతంలో అటవీ భూములు ఆక్రమించి చదును చేస్తున్నారని తెలిపారు. పచ్చని చెట్లను నరికివేస్తూ భూములు ఆక్రమిస్తున్నారని, ఇప్పటివరకు సుమారుగా 10 ఎకరాలకు పైగా అటవీ భూమి కబ్జాకు గురైందని ఆరోపించారు. అటవీశాఖ అధికారులు వెంటనే ఆక్రమణలను ఆపివేయాలని కోరారు.

కిన్నెర మొగిలయ్యకు సన్మానం


మొగిలయ్యను సన్మానిస్తున్న గంగనర్సయ్య

మల్లాపూర్: పద్మశ్రీ అవార్డు గ్రహీత మొగిలయ్యను సోమవారం మాస్టీన్ కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బుద్దుల గంగనర్సయ్య సోమవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలుసుకుని సన్మానించారు. మాస్టీన్ కులసంఘం సభ్యులతో కలిసి మొగిలయ్యను సన్మానించుకోవడంపై ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాస్టీన్ సంఘం హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు బుద్దుల రాజు, రాష్ట్ర నాయకులు రాజు, రాజయ్య పాల్గొన్నారు.

మున్నూరుకాపులు అన్నిరంగాల్లో రాణించాలి


శంకర్‌ను సన్మానిస్తున్న కాపు నాయకులు

మల్లాపూర్: మున్నూరుకాపులు అన్నిరంగాలలో రాణించాలని సంఘం మండల అధ్యక్షుడు ముత్యాల శంకర్ అన్నారు. మండంలోని కొత్త దాంరాజుపల్లిలో సోమవారం ఏర్పాటు చేసిన సంఘం సమావేశంలో మండల నూతన కార్యవర్గసభ్యులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్నూరుకాపుల బలోపేతమే లక్ష్యంగా పనిచేస్తానన్నారు. మున్నూరుకాపుల హక్కుల సాధన కోసం అహర్నిశలు కృషి చేస్తానని, అందరూ కలిసి హక్కులు సాధించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గజ్జి గంగారెడ్డి, కొత్తదాంరాజుపల్లి మున్నూరుకాపు సంఘం సభ్యులు పాల్గొన్నారు.

బిల్లులు రావు.. పనులు సాగవు

- నిలిచిన 'మన ఊరు–మన బడి' పనులు
- 9 పాఠశాలలకు రూ.2.23 కోట్లు మంజూరు
- పట్టించుకోని అధికారులు


పునాదుల్లోనే గోదూర్ ప్రాథమిక పాఠశాల అదనపు తరగతి గదులు


ఇబ్రహీంపట్నం హైస్కూల్‌లో అసంపూర్తిగా డైనింగ్ హాల్ నిర్మాణం

ఇబ్రహీంపట్నం: ప్రభుత్వ పాఠశాలల్లో మరమ్మతులు, అదనపు తరగతి గదులు నిర్మించేందుకు గత ప్రభుత్వం మన ఊరు మన బడి పథకం కింద కోట్లాది రూపాయలు నిధులు మంజూరు చేశారు. మండలంలోని 9 పాఠశాలలను ఎంపిక చేసి రూ.2.23 కోట్ల నిధులు మంజూరు చేశారు. ఈ నిధులతో పాఠశాలల్లో డైనింగ్ హాల్, మరమ్మతులు, అదనపు తరగతి గదులు, టాయిలెట్స్, ప్రహరీల నిర్మాణం, వంట గదుల నిర్మాణం చేపట్టాలి. పనులను చేసేందుకు ఆర్‌అండ్‌బీ శాఖ ఏడాది క్రితం టెండర్లు పిలవగా, పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్లు పనులు 6 నెలల్లో పూర్తి చేయాల్సి ఉండగా, నత్తనడకనా పనులు కొనసాగాయి. అరకొర పనులు చేసినప్పటికీ బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్లు అర్థాంతరంగా పనులను నిలిపివేయడంతో గోధూర్, ఇబ్రహీంపట్నం పాఠశాలలో పునాదులకే పరిమితమైంది. ఈ ఏడాది ప్రభుత్వం కొత్తగా అమ్మ ఆదర్శ పాఠశాలలను ఎంపిక చేసి, మరమ్మతుల పనులు చేపట్టడంతో మన ఊరు మన బడి పథకం కింద మంజూరైన పనులను పట్టించుకునేవారే లేరని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, సంబందిత కాంట్రాక్టర్లతో మన ఊరి మన బడి కింద మంజూరైన పాఠశాలలో వెంటనే అదనపు తరగతి గదులు, అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయించాలని ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు కోరుతున్నారు.

పునాదులకే పరిమితం..

మన ఊరు మన బడి పథకం కింద మండలంలోని 9 పాఠశాలలు ఎంపిక కాగా గోధూర్ ప్రాథమిక పాఠశాలకు రూ. 29.9 లక్షలు మంజూరు కాగా, డైనింగ్ హాల్ , 2 అదనపు తరగతి గదులు, టాయిలెట్స్, కిచెన్ షెడ్ నిర్మించ లేదు. అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు పునదుల వరకే నిర్మించారు. వర్షకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డైనింగ్ హాల్ నిర్మాణం పూర్తి కాగా, 2 అదనపు తరగతి గదులు నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. ప్రాథమిక పాఠశాలలో టాయిలెట్ల పనులు పూర్తి కాలేదు. ఇబ్రహీంపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రూ. 36 లక్షలు మంజూరు కాగా డైనింగ్ హాల్ నిర్మాణం పునాదులకే పరిమితమైంది. టాయిలెట్స్, ప్రహరీ గొడ పనులు ప్రారంభం కాలేదు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పనులు పూర్తి చేయించి, విద్యార్థుల ఇబ్బందులు తొలగించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుచున్నారు.

నోటీసులు ఇచ్చాం

మన ఊరు మన బడి పథకం కింద పాఠశాలల్లో వెంటనే పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు రెండు సార్లు నోటీసులు ఇచ్చాం. వెంటనే పనులు ప్రారంభించకపోతే కాంట్రాక్ట్‌ను రద్దు చేస్తామని హెచ్చరించాం. త్వరలోనే పనులు పూర్తి చేయిస్తాం.

– వెంకట్‌రమణ, ఆర్‌అండ్‌బీ డీఈ, మెట్‌పల్లి

ఇబ్బంది పడుతున్నాం



మన ఊరి మన బడి పథకం కింద గోధూర్ ప్రాథమిక పాఠశాలకు రూ. 29.9లక్షలు మంజూరయ్యాయి. కానీ, అదనపు తరగతి గదులు పునాదుల వరకే నిర్మించారు. టాయిలెట్స్, కిచెన్ షెడ్ లేక విద్యార్థులు, మేము ఇబ్బందులు పడుతున్నాము.

– నరేశ్, ఇన్‌చార్జి హెచ్‌ఎం, గోధూర్

పనులు పూర్తి చేయించాలి



ఇబ్రహీంపట్నం హైస్కూల్ కిరూ. 36 లక్షలు మంజూరయ్యాయి. డైనింగ్ హాల్ నిర్మాణ పనులు పునాదుల వరకే నిర్మించారు. టాయిలెట్లు నిర్మిచకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే అధికారులు చొరవ చూపి కాంట్రాక్టర్‌తో పనులు చేయించాలి.

– రాజన్న,హెచ్‌ఎం, ఇబ్రహీంపట్నం

మార్కెట్ కమిటీల ఏర్పాటెప్పుడో?


పెగడపల్లి వ్యవసాయ మార్కెట్ కార్యాలయం

పెగడపల్లి: వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గాల నియామకం కోసం ఆశావహులు ఎదురు చూస్తున్నారు. స్థానిక ఎన్నికలు ఆలస్యం కానున్న నేపథ్యంలో నాయకులు మార్కెట్ కమిటీ పదవులపై కన్నేశారు. ధర్మపురి నియోజకవర్గంలో ధర్మపురి, పెగడపల్లి, గొల్లపల్లి, వెల్గటూర్, ధర్మారం, గొల్లపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీలున్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత వ్యవసాయ మార్కెట్ కమిటీల పాలకవర్గాలను రద్దు చేసింది. రాష్ట్రంలో పలు ఎన్నికల నిర్వహణతో ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో తిరిగి నూతన పాలకవర్గాలను ప్రభుత్వం ఏర్పాటు చేయలేదు. ఈ నెల 5వ తేదీతో ఎన్నికల కోడ్ ముగిసింది. దీంతో గత పదేళ్లుగా కాంగ్రెస్ పార్టీలో ఎలాంటి అవకాశాలు దక్కని నాయకులు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్ల పదవులు వస్తాయనే ఆశతో ఉన్నారు. 2014కు ముందు ఉన్న కాంగ్రెస్ పార్టీ హయాంలో వ్యవసాయ మార్కెట్ కమిటీల పదవీకాలం రెండేళ్ల ఉండేది. కానీ తర్వాత ఏర్పడిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం మార్కెట్ కమిటీల పదవీకాలాన్ని ఏడాదికి కుదించింది. దీంతో పాటు కమిటీ పాలకవర్గాల నియామకాల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ చట్ట సవరణ చేసింది. మళ్లీ కమిటీ పదవీ కాలాన్ని రెండేళ్లకు పెంచింది. అయితే ఇప్పుడు కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇవే రిజర్వేషన్లు అమలు చేస్తుందా? లేదా? అనే ఉత్కంఠ నెలకొంది. పదవుల కోసం కాంగ్రెస్ పార్టీ నాయకులు స్థానిక ఎమ్మెల్యేను, ఇతర ముఖ్య నాయకులను, మంత్రులను కలుస్తున్నారు. పార్టీ గెలుపు కోసం ప్రయత్నం చేసిన పలువురు నాయకులు మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్ల పదవుల కోసం పోటీపడుతున్నారు.

శ్రీకనక సోమేశ్వర స్వామికి ఎస్సై దంపతుల పూజలు


పూజలు చేస్తున్న ఎస్సై దంపతులు

మల్లాపూర్: మండల కేంద్రంలోని శ్రీ కనక సోమేశ్వర ఆలయాన్ని సోమవారం ఎస్సై కిరణ్‌కుమార్ కుటుంబసభ్యులతో కలిసి సందర్శించి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికి స్వామి వారి చిత్రపటం, తీర్థప్రసాదాలు అందించారు. అనంతరం ఎస్సై కిరణ్‌కుమార్–పావని దంపతులు భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సంగ గంగరాజం, ప్రజాప్రతినిధులు,నాయకులు,ఆలయ కమిటీ సభ్యులు,భక్తులు పాల్గొన్నారు.

ముదిరాజ్ సంఘం భవనానికి భూమిపూజ

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలంలోని సత్తక్కపల్లిలో యాదవ కురమ, రాజేశ్వర్‌రావుపేటలో ముదిరాజ్ సంఘ భవనాలకు ఎంపీ ల్యాడ్స్ నుంచి రూ.6 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఈ మేరకు సోమవారం బీజేపీ కోరుట్ల నియోజకవర్గ కన్వీనర్ చెట్లపల్లి సుఖేందర్‌గౌడ్ నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు రాజ్‌పాల్‌రెడ్డి,నాయకులు వెంకటేశ్వర్లు,శ్రీధర్,రాజేందర్,నవీన్,సాగర్,నరేష్,నర్సయ్య,తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి


విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు అందించిన గోపా నాయకులు

జగిత్యాల: విద్యార్థులు ఇష్టపడి చదవాలని గౌడ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (గోపా)రాష్ట్ర అధ్యక్షుడు ఎం.రమేశ్‌గౌడ్ అన్నారు. ఎసెస్సీ, ఇంటర్‌లో 90 శాతం మార్కులు సాధించిన విద్యార్థులకు జిల్లా శాఖ ఆధ్వర్యంలో సోమవారం ప్రతిభ పురస్కారాలను అందజేశారు. ఈసందర్భంగా రమేష్ గౌడ్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకుని వాటి సాధనకు అహర్నిశలు కష్టపడాలన్నారు. ఇష్టపడి చదివితే ఏదైనా సాధించవచ్చని చెప్పారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయన్న, లక్ష్మీనారాయణ, జిల్లా అధ్యక్షుడు రవీందర్‌గౌడ్, కార్యదర్శి రాజయ్య, కోశాధికారి సత్యనారాయణగౌడ్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

వరల్డ్ కరాటే దినోత్సవం


కరాటే దినోత్సవంలో విద్యార్థులు

మెట్‌పల్లి: మెట్‌పల్లి పట్టణంలో అవినాష్ స్పోర్ట్స్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో సోమవారం వరల్డ్ కరాటే దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కరాటే విద్యార్థులు కేక్ కట్ చేశారు.అనంతరం జగిత్యాల జిల్లా చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ అవినాష్ కరాటేలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బెల్ట్‌లు, ప్రశంసపత్రాలు అందజేశారు.

సహస్త్ర లింగాల ఆలయంలో ఏకాదశి వేడుకలు



సహస్త్ర లింగాల ఆలయం, బీర్‌పూర్ లక్ష్మీనరసింహ ఆలయాల్లో పూజలు చేస్తున్న అర్చకులు, భక్తులు

జగిత్యాలరూరల్: మండలంలోని పొలాస సహస్త్ర లింగాల దేవాలయంలో సోమవారం ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు పంచామృతాభిషేకాలు, అన్నపూజ కార్యక్రమాల్లో పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు నలమాసు గంగాధర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు

శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో..

సారంగాపూర్: ప్రముఖ పుణ్యక్షేత్రం బీర్‌పూర్ శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో భక్తులు సోమవారం ప్రత్యేకపూజలు నిర్వహించారు. నిర్జల ఏకాదశి కావడంతో అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.అర్చకులు చిన్నసంతోష్, మధుకుమార్ భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలు అందించారు.

వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో వార్షికోత్సవం

సారంగాపూర్: మండలంలోని అర్పపలి పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ మొదటి వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. బీజేపీ నాయకురాలు బోగ శ్రావణి పూజల్లో పాల్గొని స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు.

'కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యలు ఖండిస్తున్నాం'


మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

మెట్‌పల్లి: రాష్ట్ర మంత్రి, బీసీ సంక్షేమ నాయకుడు పొన్నం ప్రభాకర్‌పై హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఇష్టారీతిన వ్యాఖ్యలు చేయడం సరికాదని బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు నల్ల వెంకటేశ్వర్లు అన్నారు. మెట్‌పల్లిలో సోమవారం మాట్లాడారు. నీతి నిజాయితీకీ మారుపేరైన మంత్రి ప్రభాకర్‌పై ఎన్డీపీసీ బూడిదకు సంబంధించిన విషయంలో అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. వ్యాఖ్యలను ఉపసంహరించుకుని బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ప్రతాప్,సదానందం, శ్రీకాంత్, అంజయ్య, రాజు, శ్రీరాములు పాల్గొన్నారు.


జగిత్యాల రూరల్: పొలాసలో ముస్లింల ప్రార్థనలు


ధర్మపురిలో..


కోరుట్ల పట్టణంలో ప్రార్థనలు


కథలాపూర్ మండలం సిరికొండలో..

ఘనంగా బక్రీద్ వేడుకలు


రాయికల్‌లో ముస్లింల ప్రార్థనలు

జగిత్యాలరూరల్/కోరుట్ల/కోరుట్ల రూరల్ /రాయికల్/మల్లాపూర్/పెగడపల్లి/ధర్మపురి/ ఇబ్రహీంపట్నం/ కథలాపూర్/మల్యాల/ సారంగాపూర్/మేడిపల్లి: బక్రీద్ వేడుకలు జిల్లా వ్యాప్తంగా సోమవారం ఘనంగా జరిగాయి. పట్టణాలు, మండల కేంద్రాలు, పలు గ్రామాల్లో ఈద్గా వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పండుగ సందర్భంగా చనిపోయిన తమ పెద్దల పేర్లమీద ధానధర్మాలు చేశారు. నాయకులు ముస్లిం సోదరులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

బోరు వేశారు.. మోటారు మరిచారు..



కోరుట్ల రూరల్: మండంలోని కల్లూర్‌లో తాగునీటి ఎద్దడి నివారణకు పదిహేను రోజుల క్రితం బోరు వేశారు కానీ. మోటారు బిగించకపోవడంతో బోరు బావి నిరుపయోగంగా మారింది. ఇప్పటికైనా మోటరు బిగించి నీటి సరఫరా చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.


గుంతలమయమైన రంగాపూర్–కాచాపూర్ రోడ్డు

కుంట కాదు.. రోడ్డే..!

మేడిపల్లి: రంగాపూర్–కాచారం రోడ్డు అధ్వానంగా తయారైంది. చిన్నపాటి వర్షానికే గుంతలుపడి, వర్షపునీరు రోడ్డుపై నిలవడంతో ప్రయాణికులకు చుక్కలు కనబడుతున్నాయి. గుంతల్లో వాహనాలు పడి వాహనదారులు గాయాలపాలవుతున్నారు. ఇంతకుముందు ఈరోడ్డు మార్గాన తారురోడ్డు ఉండేది. కానీ రెండేళ్ల క్రితం కొత్త రోడ్డు వేస్తామని తారురోడ్డును తొలగించారు. ఇప్పటివరకు రోడ్డు వేయకపోవడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఆరు గ్రామాలకు ఇదే ప్రధాన రోడ్డు. నిత్యం వందల సంఖ్యలో వాహనదారులు ప్రయాణం చేస్తుంటారు. ఇప్పటికైకా నూతన రోడ్డుని త్వరగా వేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

మల్లాపూర్: మండలంలోని మొగిలిపేట శివారులో సోమవారం అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. గోదావరినది తీరప్రాంతాల నుంచి ట్రాక్టర్లలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారని విశ్వసనీయ సమచారం మేరకు పోలీసు సిబ్బందితో దాడి జరిపినట్లు పేర్కొన్నారు. ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు వివరించారు.

రంగపేటలో ఒకటి..

సారంగాపూర్: మండలంలోని రంగపేట శివారులో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని కేసు నమోదు చేశారు. స్టేషన్‌హౌజ్ అధికారి శ్రీనివాస్ కథనం ప్రకారం.. మండలంలోని ఒడ్డెర కాలనీ గ్రామానికి చెందిన పల్లపు గణేశ్ రాయికల్ మండలం కొత్తపేట వాగు నుంచి అక్రమంగా ట్రాక్టర్‌లో ఇసుక తరలిస్తుండగా పోలీసులు పట్టుకుని సీజ్ చేశారు. గణేశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

సిరికొండలో..

కథలాపూర్: మండలంలోని సిరికొండ శివారులోని వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్లు ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై నవీన్‌కుమార్ సోమవారం తెలిపారు. వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్ పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

నేడు రైతు వేదికలో శిక్షణ

ఇబ్రహీంపట్నం : మండలకేంద్రంలోని రైతు వేదిక వద్ద మంగళవారం ఉదయం 10 గంటలకు రైతులకు వానకాలం వరిసాగుపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నట్లు ఏవో దీపిక తెలిపారు.

నియామకం

మర్రవ్వ ఆలయ నూతన కార్యవర్గం

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేట గ్రామశివారులోని మర్రవ్వ ఆలయం నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జవిడి సంతోష్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా మామిడిపెల్లి లింగారెడ్డి, కోశాధికారిగా తుమ్మనపెల్లి మహేశ్, కార్యవర్గసభ్యులుగా అంగిరి శ్రీకాంత్, చిగుర్ల భూమయ్య, పచ్చిమట్ల గంగాధర్, భైర రాజేశ్, కారంగుల శంకర్, ఎల్ల దశరథం, ఉకోల ప్రభాకర్, రాగుట్ల రాజం ఎన్నికయ్యారు. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

గోపా మండల అధ్యక్షుడిగా ప్రభాకర్‌గౌడ్

పెగడపల్లి:మండల గౌడ్ ఆఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ సొసైటీ (గోపా) అధ్యక్షుడిగా మండలంలోని నంచర్లకు చెందిన రంగు ప్రభాకర్‌గౌడ్ ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా నేరెళ్ల గంగాధర్‌గౌడ్, కోశాధికారిగా ఉయ్యాల పరశురాంగౌడ్, ఉపాధ్యక్షుడిగా అభిలాష్‌గౌడ్, కొండ శ్రీనివాస్‌గౌడ్, శేఖర్ గౌడ్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా సాయికుమార్‌గౌడ్, సంయక్త కార్యదర్శిగా రాజుగౌడ్ ఎన్నికయ్యారు.